

# కమర్షియల్ ‘దేవర’లో ఎమోషనల్ సాంగ్

ప్రేమకథల్లో మాంటేజ్ సాంగ్స్ ఇచ్చే కిక్ మామూలుగా ఉండదు. సంగీతం, సాహిత్యం, సందర్భం, చిత్రీకరణ బావుంటే చాలు. ఆ పాట కోసమే మళ్లీ మళ్లీ సినిమా చూస్తుంటారు ప్రేక్షకులు. ఇలాంటి పాటనే ‘దేవర’లో తారక్, జాన్వీక పూర్‌లపై చిత్రీకరించనున్నారట దర్శకుడు కొరటాల శివ. తాజా సమాచారం ప్రకారం ఈ నెల మూడో వారం జరిగే షెడ్యూల్‌లోనే ఈ ఎమోషనల్ సాంగ్ చిత్రీకరణ ఉంటుందట. ఈ సినిమాకు అనిరుధ్ స్వరాలందిస్తున్న విషయం తెలిసిందే. ఈ పాట మొత్తం హీరోహీరోయిన్ల ప్రేమను ఆవిష్కరించేలా ఉంటుందని తెలుస్తున్నది. ఈ పాటలో వీఎఫ్ఎక్స్ విజువల్స్ ప్రత్యేక ఆకర్షణగా ఉండేలా కొరటాల ప్లాన్ చేశారట. దాదాపు 300కోట్ల భారీ బడ్జెట్‌తో రెండు భాగాలుగా కొసరాజు హరికృష్ణ నిర్మిస్తున్న ఈ పాన్ ఇండియా చిత్రంపై భారీ అంచనాలే ఉన్నాయి. ఎన్టీఆర్, కొరటాల శివ కాంబినేషన్‌లో వచ్చిన ‘జనతా గ్యారేజ్’ ఎంతటి విజయాన్ని చూసిందో తెలిసిందే. ఆ సినిమాను మించేలా.. కసితో కొరటాల శివ ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నట్టు చిత్రబృందం చెబుతున్నది. వచ్చే ఏడాది ఏప్రిల్ 5న ఈ చిత్రం విడుదల కానుంది.



# మడికట్టుకొని కూర్చుంటే ఇదంతా జరిగేదా?

‘ఉప్పెన’తో ఉవ్వెత్తున ఎగసిపడే కెరటంలా టాలీవుడ్‌లోకి దూసుకొచ్చిన కృతిశెట్టి.. ఇప్పుడు కోలీవుడ్‌లో బిజీబిజీగా ఉంది. అక్కడ ఏకంగా మూడు సినిమాల్లో నటిస్తున్నది ఈ బెంగళూరుభామ. కార్తీకి జోడీగా ‘వా వాతియారే’లో నటిస్తున్న ఈ ముద్దుగుమ్మ.. ‘లవ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్’(ఎల్ఐసీ)లో ప్రదీప్ రంగనాథన్‌తో జతకడుతున్నది. వీటితోపాటు ‘జెనీ’లో జయం రవికి జంటగా నటిస్తున్నది. ఈ మూడు సినిమాలూ వచ్చే ఏడాది విడుదల కానున్నాయి. ఇక తెలుగులో ఓ సినిమా, మలయాళంలో ఓ సినిమా చేస్తూ.. మొత్తానికి సౌత్‌లోని దాదాపు అన్ని భాషలను కవర్ చేస్తున్నది కృతిశెట్టి. తమిళ సినిమాపై ఎక్కువ దృష్టిపెట్టడానికి గల కారణం పై ఓ ఇంటర్వ్యూలో అడిగిన ప్రశ్నకు ఆసక్తికరంగా సమాధానం ఇచ్చింది కృతిశెట్టి. ‘పర్టిక్యులర్‌గా తమిళ సినిమాపైనే దృష్టి పెట్టాను అనడం తప్పు. కథలు వినే క్రమంలో నచ్చిన కథలకు సైన్ చేస్తున్నాను. నేను నటిని. నటనకు భాషలతో పనేముంది? నేను కన్నడ అమ్మాయిని. తెలుగులో బ్రేక్ వచ్చింది. ఒకే భాషలో చేస్తానని మడికట్టుకొని కూర్చుంటే ఇదంతా జరిగేదా? కేరక్టర్ల గురించి తెలుసుకోవడం.. నచ్చిన పాత్రలను భాషలతో నిమిత్తం లేకుండా చేసుకుంటూ పోవడం ఇదే నా పని’ అంటూ చెప్పుకొచ్చింది కృతి శెట్టి.



రాజ్‌తరుణ్, నాగార్జున, అల్లరి నరేష్

# మాస్ యాక్షన్ హంగామా

అగ్ర నటుడు అక్కినేని నాగార్జున తాజా చిత్రం ‘నా సామిరంగ’ సంక్రాంతి కానుకగా ప్రేక్షకుల ముందుకు రాబోతున్న విషయం తెలిసిందే. విజయ్ బిన్నీ దర్శకుడిగా పరిచయమవుతున్న ఈ చిత్రాన్ని శ్రీనివాస సిల్వర్ స్క్రీన్ పతాకంపై శ్రీనివాస చిట్టూరి నిర్మిస్తున్నారు. అల్లరి నరేష్, రాజ్‌తరుణ్ కీలక పాత్రలను పోషిస్తున్నారు. ఆషికా రంగనాథ్ కథానాయిక. మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా స్నేహబంధం చుట్టూ అల్లుకున్న కథతో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ఆదివారం టీజర్‌ను విడుదల చేశారు. నాగార్జున–ఆషికా రంగనాథ్ మధ్య వచ్చే సరదా సన్నివేశాలు..అల్లరి నరేష్, రాజ్‌తరుణ్‌తో నాగార్జున ఫ్రెండ్‌షిప్‌ను తెలియజేస్తూ టీజర్ ఆద్యంతం ఆకట్టుకుంది. మామిడి తోటలో నాగ్ ఎంట్రీ ఫైట్ సీన్ ప్రధానాకర్షణగా నిలిచింది. స్నేహం, యాక్షన్ ఎలిమెంట్స్‌తో టీజర్‌ను ఆసక్తికరంగా తీర్చిదిద్దారు. నాగార్జున గోదావరి యాసలో మాట్లాడుతూ కనిపించారు. ఈ చిత్రానికి కెమెరా: శివేంద్ర దాశరథి, సంగీతం: ఎం.ఎం.కీరవాణి, కథ, మాటలు: ప్రసన్నకుమార్ బెజవాడ, సాహిత్యం: చంద్రబోస్, దర్శకత్వం: విజయ్ బిన్ని.



# అన్యాయాలపై ‘భగీర’ పోరాటం

‘ఉగ్రం’ వంటి బ్లాక్‌బస్టర్ చిత్రంతో కన్నడంలో మంచి గుర్తింపును సంపాదించుకున్న హీరో శ్రీమురళి నటిస్తున్న తాజా చిత్రం ‘భగీర’. కేజీఎఫ్, కాంతార, సలార్ వంటి భారీ ఫ్రాంచైజీలతో ప్రేక్షకులను అలరిస్తున్న ప్రముఖ నిర్మాణ సంస్థ హోంబలే ఫిల్మ్స్ నిర్మిస్తున్నది. డా|| సూరి దర్శకత్వం వహిస్తున్నారు. రుక్మిణి వసంత్ కథానాయిక. ఆదివారం హీరో శ్రీమురళి జన్మదినం సందర్భంగా టీజర్‌ను విడుదల చేశారు. లోకంలో అన్యాయం పెరిగినప్పుడు దానిని అంతం చేయడానికి ఓ హీరో వస్తాడని తెలియజెపుతూ టీజర్ పవర్‌ఫుల్‌గా సాగింది. ఈ చిత్రానికి అజనీష్ లోకనాథ్ సంగీతాన్నందిస్తున్నారు. పాన్ ఇండియా స్థాయిలో తెరకెక్కిస్తున్న ఈ చిత్రాన్ని వచ్చే ఏడాది విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు.



# వేలకోట్లతో కూడా వెలకట్టలేని అభిమానం ఇది

నయనతార ప్రస్తుతం ‘అన్నపూరణి’ అనే పేరుతో ఓ సినిమా చేస్తున్న విషయం తెలిసిందే. తమిళంలో రూపొందుతున్న ఈ చిత్రం షూటింగ్ ప్రస్తుతం చెన్నయ్‌లో శరవేగంగా జరుగుతున్నది. మరి ఆ పాత్ర ప్రభావమేమోగానీ రీసెంట్‌గా నయన్ ఓ బాలికల అనాథ శరణాలయాన్ని సందర్శించి, అక్కడున్న బాలికలందరికీ మంచి విందుభోజనాన్ని తన సొంత ఖర్చుతో అందించింది. తమ శరణాలయానికి నయన్ రావడంతో అక్కడున్న బాలికల ఆనందానికి అవధులు లేకుండాపోయాయి. వచ్చి అమాంతం నయన్‌ను హత్తుకుంటూ ముద్దులు పెట్టేస్తూ తమ సంతోషాన్ని వెలిబుచ్చారు. ఈ సందర్భంగా నయన్ మాట్లాడుతూ ‘నిజంగా ఇవాళ చాలా ఆనందంగా ఉంది. జీవితంలో కొన్ని పనులు చేస్తే ఏదో తెలీని సంతృప్తి. వీళ్లందరూ నాపై చూపిస్తున్న అభిమానం వేలకోట్లతో కూడా వెలకట్టలేనిది. ఈ రోజు వీళ్లతోనే కలిసి భోంచేశాను. ఇక నుంచి ప్రతి ఏడాదీ ఓ రోజు వీళ్లకు కేటాయించాలనుకుంటున్నాను. ఇంకా వీళ్లకోసం ఏమైనా చేయాలి. త్వరలోనే నా నిర్ణయాన్ని చెబుతా’ అంటూ తన సంతోషాన్ని వెలిబుచ్చింది నయనతార.

# రవితేజ ‘మిస్టర్ బచ్చన్’ ప్రారంభం



భాగ్యశ్రీ, హరీశ్‌శంకర్, వి.వి వినాయక్, రవితేజ, టీజీ విశ్వప్రసాద్

రవితేజ కథానాయకుడిగా హరీశ్‌శంకర్ దర్శకత్వంలో రూపొందిస్తున్న తాజా చిత్రం ‘మిస్టర్ బచ్చన్’ ఆదివారం హైదరాబాద్‌లో ప్రారంభమైంది. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్నారు. భాగ్యశ్రీ బోర్సే కథానాయిక. రవితేజ స్వతహాగా బిగ్‌బి అమితాబ్‌బచ్చన్‌కు వీరాభిమాని. ఈ నేపథ్యంలో సినిమాకు మిస్టర్ బచ్చన్ టైటిల్ పెట్టడం విశేషం. టైటిల్ పోస్టర్‌లో సైతం ఆయన అమితాబ్ పోజ్‌ను అనుకరిస్తూ కనిపిస్తున్నారు. ‘మిస్టర్ బచ్చన్..నామ్ తో సునా హోగా’ అని రవితేజ చెప్పిన డైలాగ్‌తో ముహూర్తపు సన్నివేశాన్ని చిత్రీకరించారు. దీనికి కుమార్ మంగత్ పాఠక్ క్లాప్‌నివ్వగా, కే.రఘురామకృష్ణ, టీజీ భరత్ కెమెరా స్విఛాన్ చేశారు. ఈ సినిమాలో అమితాబ్‌బచ్చన్ అభిమానిగా రవితేజ కనిపిస్తారని తెలిసింది. ఈ చిత్రానికి కెమెరా: ఆయనంక బోస్, సంగీతం: మిక్కీ జే మేయర్, ప్రొడక్షన్ డిజైనర్: అవినాష్ కొల్లా, సమర్పణ: పనోరమా స్టూడియోస్, టీ–సిరీస్, సహనిర్మాత: వివేక్ కూచిభొట్ల, నిర్మాత: టీజీ విశ్వప్రసాద్, రచన–దర్శకత్వం: హరీశ్ శంకర్.



# నీ పసుపు పాదాలే తగిలి గడప పూసెనా

గాయని సునీత కుమారుడు ఆకాష్ హీరోగా పరిచయమవుతున్నాడు. సినిమాపేరు ‘సర్కారు నౌకరి’. భావన కథానాయిక. ప్రఖ్యాత దర్శకుడు కె.రాఘవేంద్రరావు ఈ చిత్రానికి నిర్మాత కావడం విశేషం. స్వీయ రచనతో సినిమాటోగ్రఫీని కూడా తానే అందిస్తూ గంగనమోని శేఖర్ ఈ చిత్రానికి దర్శకత్వం వహించారు. జనవరి 1న సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా ‘నీ పసుపు పాదాలే’ అంటూ సాగే లిరికల్ సాంగ్‌ని మేకర్స్ విడుదల చేశారు. కాసర్ల శ్యామ్ రాసిన ఈ గీతాన్ని శాండిల్య పీసపాటి స్వరపరిచి, కీర్తనతో కలిసి ఆలపించారు. ‘నీ పసుపు పాదాలే తగిలి గడప పూసెనా.. నీ ఎరుపు సిగ్గుల్లో ఎలిగి మెరిసెనా.. కంచు మెట్టె సప్పుళ్లో ఇల్లే కళ్లు తెరిసి సూసెనా..’ అంటూ నవవధువు అత్తింట్లోకి అడుగుపెడుతున్న సందర్భంలో సాగే ఈ పాట కథలో భాగంగా ఉంటుందని, చిత్రీకరణ కూడా అద్భుతంగా కుదిరిందని దర్శకుడు తెలిపారు. తనికెళ్ల భరణి, రమ్య పొందూరి, సత్య సాయి శ్రీనివాస్ తదితరులు ఇందులో ఇతర పాత్రధారులు.




# శత్రువు వేటలో..

**అడివి శేష్, శృతిహాసన్** ప్రధాన పాత్రల్లో ఓ పాన్ ఇండియా చిత్రం తెరకెక్కుతున్న విషయం తెలిసిందే. అన్నపూర్ణ స్టూడియోస్ సమర్పణలో సుప్రియ యార్లగడ్డ నిర్మిస్తున్నారు. షానీల్ డియో దర్శకుడు. హిందీ, తెలుగు భాషల్లో రూపొందిస్తున్నారు. ఈ సినిమా నుంచి శృతిహాసన్ ఫస్ట్‌గ్లింప్స్‌ను విడుదల చేశారు. ముఖంపై స్కార్ఫ్ చుట్టుకొని తీక్షణ చూపులతో సీరియస్‌గా కనిపిస్తున్నది శృతిహాసన్. యాక్షన్ డ్రామాగా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. టైటిల్‌ను ఈ నెల 18న విడుదల చేయబోతున్నారు. ఈ సినిమాలో శృతిహాసన్ పాత్ర శక్తివంతంగా ఉంటుందని, ఆమె కెరీర్‌లో విభిన్నమైన చిత్రమవుతుందని దర్శకుడు తెలిపారు. ఈ చిత్రానికి కథ, స్క్రీన్‌ప్లే: అడివి శేష్, షానీల్ డియో, సహ నిర్మాత: అడివి శేష్. ఈ సినిమాకు సంబంధించిన మరిన్ని వివరాలను త్వరలో వెల్లడించనున్నారు.

# నా కలలే నిజమయ్యేలా..

**సంపూర్ణేష్‌బాబు, సంజోష్,** ప్రాచీ బంసాల్, ఆరతి గుప్తా హీరోహీరోయిన్లుగా నటిస్తున్న చిత్రం ‘సోదరా’. మన్‌మోహన్ మేనంపల్లి దర్శకత్వంలో చంద్ర చంగలా నిర్మిస్తున్నారు. ఈ సినిమా నుంచి ‘పిల్లా పిల్లా..నన్ను చూసి నావే పిల్ల..నా కలలే నిజమయ్యేలా..’ అనే రెండో గీతాన్ని ఆదివారం విడుదల చేశారు. ‘మొదటి పాట అన్నదమ్ముల అనుబంధాన్ని ఆవిష్కరించింది. ఇప్పుడీ రెండో గీతం రొమాంటిక్ మెలోడీగా ఆకట్టుకుంటుంది. కుటుంబ అనుబంధాల నేపథ్యంలో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నాం. వినోదంతో పాటు చక్కటి భావోద్వేగాలుంటాయి’ అని చిత్రబృందం పేర్కొంది. బాబా భాస్కర్, బాబు మోహన్, గెటప్ శ్రీను తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: జాన్, సంగీతం: సునీల్ కశ్యప్, నిర్మాణ సంస్థ: క్యాన్స్ ఎంటర్‌టైన్‌మెంట్, మాంక్ ఫిలిమ్స్, కథ, దర్శకత్వం: మన్‌మోహన్ మేనంపల్లి.



ప్రాచీ బంసాల్, సంపూర్ణేష్‌బాబు

